సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 9 । జనవరి । 2024



మామిడిని ముంచే 'మంచు'


ఇప్పుడిప్పుడే మామిడి పూత దశకు చేరుకుంటోంది. పూత పిందెగా మారితేనే మామిడి రైతుకు లాభిస్తుంది. ప్రస్తుతం కురుస్తున్న మంచు, చలితో తెగుళ్లు విజృంభించే అవకాశం ఉంది. 8లో



రూ.50 వేల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవనానికి వెళ్లపాలెం సాయి నిఖిల్‌రెడ్డి, రేఖారెడ్డి దంపతులు (హైదరాబాద్ ఆసిఫ్ నగర్) సోమవారం రూ.50 వేల విరాళం అందించారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 11 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,350, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.70 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

గడువులోగా అర్జీల పరిష్కారం



అర్జీలు తీసుకుంటున్న జేసీ నుపూర్ అజయ్, డీఆర్‌ఓ సత్తిబాబు తదితరులు

అమలాపురం రూరల్: జగనన్నకు చెబుదాం–ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబులతో కలిసి జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ అర్జీలను సత్వరం పరిష్కరించవల సిందిగా ఆయా శాఖల అధికారులను జేసీ ఆదేశించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న నవరత్నాలు, వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, సామాజిక భద్రత పింఛన్ల రీ సర్వే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 293 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్ర స్థాయిలో పూర్తిగా విచారించిన అర్జీదారులకు సంతృప్తి కరమైన పరిష్కార మార్గాలు పూర్తిస్థాయిలో చూపుతూ వ్యవస్థ పనితీరు పట్ల అర్జీదారులలో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. జిల్లాస్థాయి అధికారులు తమ లాగిన్ కు వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించే దిశగా చర్యలు బలోపేతం చేయాలన్నారు. మండల స్థాయి నుంచి అందిన అర్జీలపై వర్చువల్ విధానంలో అధికారులను సంప్రదించి పరిష్కార మార్గాలు చూపారు.

పోలీస్ 'జగనన్నకు చెబుదాం'కు 23 అర్జీలు



అర్జీదారులు అందించిన ఫిర్యాదులపై మాట్లాడుతున్న ఏఎస్పీ ఖాదర్ బాషా

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 23 అర్జీలు వచ్చాయి. జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి అర్జీదారులు వచ్చి తమ సమస్యలను ఏకరవు పెట్టుకున్నారు. వచ్చిన ఫిర్యాదుల్లో ఆస్తి వివాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయ స్పెషల్ బ్రాంచి సీఐ బి.రాజశేఖర్ కూడా పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): తమ కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి జి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యూజన్ మైక్రో ఫైనాన్స్, ఇంపాక్ట్ డయాగ్నస్టిక్స్, స్విగ్గీ సంస్థల్లో 366 ఉద్యోగాలకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయన్నారు. టెన్త్ నుంచి డిగ్రీ వరకూ విద్యార్హతలున్న వారు హాజరు కావచ్చని తెలిపారు. ఎంపికైన వారికి రూ.14 వేల నుంచి రూ.28 వేల వరకూ వేతనం చెల్లిస్తారన్నారు. వివరాలకు 0884–2373270 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పక్కాగా సర్కారు వారి లెక్క

- జిల్లాలో తేలిన పంట నష్టం
- మిచాంగ్ తుపాను వల్ల గత నెలలో భారీ వర్షాలు
- 25,944 ఎకరాలలో దెబ్బతిన్న వరి
- పెట్టుబడి రాయితీగా రైతులకు అందనున్న రూ.20.24 కోట్లు
- ప్రభుత్వానికి నివేదిక పంపించిన వ్యవసాయ, ఉద్యాన శాఖ
- పంట నష్టపోయిన వెంటనే పరిహారమిస్తున్న ప్రభుత్వం



మిచాంగ్ తుపాను వర్షాలకు అల్లవరంలో నీట మునిగిన వరి చేలు (ఫైల్)



సాక్షి అమలాపురం: మిచాంగ్ తుపాను వల్ల వ్యవసాయ, ఉద్యాన పంటలకు కలిగిన నష్టంపై అధికారులు లెక్క తేల్చారు. గత నెలలో తుపాను వల్ల భారీ వర్షాలతో వరితోపాటు ఉద్యాన పంటలైన అరటి, కూరగాయలు, కొబ్బరి పంటలకు నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. పంట నష్టాలపై ప్రాథమిక అంచనాలు తయారు చేసిన జిల్లా యంత్రాంగం ప్రభుత్వ ఆదేశాలతో డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తిస్థాయి నష్టపరిహార అంచనాలను రూపొందించింది. ఇందుకు సంబంధించిన నివేదికను అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు.

మిచాంగ్ తుపాను వల్ల గత డిసెంబర్ మూడో తేదీ నుంచి ఆరో తేదీ వరకు రికార్డ్ స్థాయిలో వర్షాలు కురిసాయి. కుండపోత వర్షానికి ఖరీఫ్ వరి చేలు నేలనంటి నీటమునిగాయి. ముఖ్యంగా అమలాపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు వ్యవసాయ సబ్ డివిజన్‌లలో వరికి అధికంగా నష్టం వాటిల్లింది. జిల్లాలో మొత్తం 25,944 ఎకరాల్లో వరి పంట నష్టం జరిగిందని అధికారులు గుర్తించారు. ఇందుకుగాను 19,849 మంది రైతులకు పెట్టుబడి రాయితీగా రూ.17,85,60,000 అందనున్నాయి. వీరిలో చిన్న, సన్నకారు రైతులకు చెందిన 23,281 ఎకరాల్లో వరి పంట నష్టం జరగగా, 19,717 మంది రైతులకు రూ.16,02,36,000 అందనుంది. పెద్ద రైతులకు సంబంధించి 2,663.15 ఎకరాలలో పంట నష్టపోగా 672 మంది రైతులకు రూ.1,83,29,000 ఇవ్వనున్నారు.

2,870 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం

తుపాను వల్ల వరితో పాటు ఉద్యాన పంటలకు సైతం నష్టం వాటిల్లింది. కూరగాయలు, బొప్పాయి, అరటి, ఇతర ఉద్యాన పంటలకు సంబంధించి 2,870.14 ఎకరాల్లో పంట నష్టపోయినట్టు అధికారులు గుర్తించారు. దీంతోపాటు 309 కొబ్బరి చెట్లు దెబ్బతిన్నాయి. ఇందుకుగాను 3,530 మంది ఉద్యాన పంటల రైతులకు రూ.2,36,60,411 పెట్టుబడి రాయితీగా అందనుంది. అరటికి హెక్టార్‌కు రూ.25 వేలు, కూరగాయలు, బొప్పాయి, పసుపు, పువ్వుల సాగుకు హెక్టారుకు రూ.17 వేల చొప్పున, తమలపాకు సాగుకు హెక్టారుకు రూ.75 వేల చొప్పున పెట్టుబడి రాయితీ అందనుంది. వీటితోపాటు దెబ్బతిన్న కొబ్బరి చెట్టుకు రూ.వెయ్యి చొప్పున రైతులకు అందించనున్నారు. 95 మంది రైతులకు రూ.3,09,000 అందించనున్నారు.

నమ్మకంతో రైతులు

పంట నష్టపోయిన వెంటనే రెండవ పంట కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు పరిహారం (పెట్టుబడి రాయితీ రూపంలో) అందజేస్తోంది. ఒక్కొక్కసారి నెల రోజులలోనే ఈ పెట్టుబడి రాయితీ నేరుగా రైతుల ఖాతాలో జమ అవుతోంది. పంట నష్ట పరిహారం నమోదు పూర్తయి ప్రభుత్వానికి నివేదిక అందిందని తెలిసిన రైతులు త్వరలోనే తమకు పెట్టుబడి రాయితీ వస్తుందని నమ్మకంతో ఉన్నారు.

నష్టపోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ



తుపాను వల్ల నష్టపోయిన ప్రతి రైతుకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పంట నష్టం నమోదు చేశాం. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా నష్టం నమోదు పూర్తి చేశాం. క్షేత్రస్థాయిలో వీఏఏలు, వీహెచ్‌ఏలు, వీఆర్వోలు కలిసి సంయుక్తంగా నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.

– వి.బోసుబాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

దెబ్బతిన్న కొబ్బరి చెట్లకు పరిహారం



ఉద్యాన పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం పెట్టుబడి రాయితీ అందిస్తుంది. జిల్లాలో అరటి, కూరగాయలు, బొప్పాయి వంటి పంటలతో పాటు కొబ్బరి చెట్లకు జరిగిన నష్టాన్ని కూడా నమోదు చేశాం. వారికి కూడా పరిహారం అందుతుంది.

– బి.వి.రమణ, జిల్లా ఉద్యాన అధికారి



తుపాను వల్ల నేలకొరిగిన అరటిపంట (ఫైల్)

250 ఆర్టీసీ స్పెషల్ బస్సులు



పాత్రికేయులతో మాట్లాడుతున్న ప్రజా రవాణా అధికారి నాగేశ్వరరావు

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లాలో సంక్రాంతి పండగకు ఆర్టీసీ డిపోల నుంచి 250 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి వీఎస్ నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అమలాపురం, రామచంద్రపురం, రాజోలు, రావులపాలెం డిపోల ద్వారా ఈ నెల 10 తేదీన నుంచి 13 వరకు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంకు సంక్రాంత్రి స్పెషల్ బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. తిరుగు ప్రయాణంలో ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకూ ప్రత్యేక బస్సులు నడపనున్నారు. హైదరాబాద్‌కు నాలుగు డిపోల నుంచి 10 తేదీన 13 వరకు ఇప్పటికే 57 ప్రత్యేక బస్సులను ఆన్‌లైన్ రిజర్వేషన్‌కు అందుబాటులో ఉంచమని తెలిపారు. తిరుగు ప్రయాణానికి మరో 90 ప్రత్యేక బస్సులను సిద్ధం చేసినట్లు తెలిపారు. వీటితో పాటు విజయవాడ, విశాఖ నగరాలకు డిమాండ్‌ను బట్టి 100 అదనపు బస్సులు నడపనున్నారు. కోనసీమ జిల్లాలో నాలుగు డిపోల పరిధిలో రోజూ 94 సాధారణ బస్సులు నడుపుతున్నట్టు తెలిపారు. ప్రయాణికుల రద్దీని సొమ్ము చేసుకునేందుకు ప్రైవేటు ట్రావెల్స్ ఇప్పటికే అధిక చార్జీలు వసూలు చేస్తున్నాయని తెలిపారు. ప్రజాసేవే పరమావధిగా గతంలో మాదిరిగానే అదనపు చార్జీల భారం లేకుండా సాధారణ చార్జీలతో ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామని తెలిపారు. గత ఏడాది జిల్లాలో రూ.60 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఈ ఏడాది రూ.80 లక్షల ఆదాయం సాధించాలని లక్ష్యం నిర్దేశించామన్నారు. డీఎం చల్లా సత్యనారాయణమూర్తి, ఓపీఆర్‌ఎస్ ఇన్‌చార్జి ఎస్.వరహాలబాబు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని ముస్లిం కుటుంబాలకు వివరిద్దాం

వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ సమావేశంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్



సమావేశంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్‌ను సత్కరిస్తున్న నాయికులు

అమలాపురం టౌన్: ముస్లింలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాల తోపాటు ఇతర పథకాల లబ్ధిని జిల్లాలోని ప్రతి ముస్లిం కుటుంబానికి వివరించాలని వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ పిలుపునిచ్చారు. ఇటీవల పార్టీ అధిష్టానం నియమించిన జిల్లా పార్టీ మైనార్టీ సెల్ నూతన కార్యవర్గం స్థానిక శ్రీరామపురంలో సోమవారం ఖాదర్ అధ్యక్షతన సమావేశమైంది. ఈ సందర్భంగా ఖాదర్‌తోపాటు జిల్లా నూతన కమిటీలోని పలువురు ముస్లిం నేతలు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి అయ్యే దిశగా జిల్లాలోని ముస్లింలు అండగా నిలబడాలని స్పష్టం చేశారు. రానున్న మూడు నెలల్లో జిల్లా కమిటీ పట్టణాల్లో, గ్రామాల్లో ప్రతీ ముస్లిం ఇంటిని సందర్శించాలన్నారు. ప్రతీ మసీదు, దర్గా, అసురాఖానాల్లో ముస్లింలతో సమావేశాలు ఏర్పాటుచేసి జగన్ పాలనలో ముస్లింలకు అందుతున్న సంక్షేమ ఫలాలను వివరించాలని పేర్కొన్నారు. జిల్లా పార్టీ మైనార్టీ సెల్ ప్రతినిధులు ఖాదర్‌ను సత్కరించి అభినందించారు. పార్టీ జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ఎండీ జాఫర్, ప్రధాన కార్యదర్శులు అన్వర్ తాహిర్ ఉద్దీన్, ఎం.అలీ హసన్, కార్యదర్శి షేక్ అన్వర్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ రెహమాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, షేక్ ఖాజాబాబు, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్లు ఎండీ వై.షరీఫ్, జాఫర్ హుస్సేన్, ఇంటియాస్ బాషా, సజ్యాద్ హుస్సేన్ పాల్గొన్నారు.

దోష రహితంగా రెవెన్యూ రికార్డులు

అమలాపురం రూరల్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష రీ సర్వేకు సంబంధించి దోష రహితంగా రెవెన్యూ రికార్డులు స్వచ్ఛీకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, రెవెన్యూ, సర్వే ఉద్యోగులను ఆదేశించారు. సోమవారం ఆమె కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో రీ సర్వే, ఆడుదాం ఆంధ్ర, అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణ, అసైన్డ్, లంక భూముల ఈకేవైసీ, ఉచిత హక్కులు, కోడిపందేల నియంత్రణకు చర్యలపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ రీసర్వే పనులను సకాలంలో పూర్తి చేయాలని, రెవెన్యూ రికార్డులను స్వచ్ఛీకరించాలని ఆదేశించారు. బుధవారం నుంచి మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ప్రారంభించాలని ఆమె సూచించారు. వివిధ పాఠశాలలకు చెందిన ఫిజికల్ డ్రిల్ సంచాలకులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ల సహకారంతో ఈ క్రీడా పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ నెల 19న విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నదని, తొమ్మిది నుంచి 18వ తేదీ వరకు జన్ భాగీదారీ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందన్నారు. అంగన్వాడీ కేంద్రాల పనితీరును సమీక్షించి, టేక్ హోం రేషన్ గర్భిణులు, బాలింతలకు పూర్తిస్థాయిలో అందించాలని ఆదేశించారు. కోడిపందేల నియంత్రణకు మండల స్థాయిలో తహసీల్దార్, ఎస్సై, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో కమిటీని, గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ రెవెన్యూ సహాయకులతో కూడిన బృందాన్ని నియమించాలన్నారు. డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పెన్షన్ల పెంపు ఏపీలోనే..



పెరిగిన పెన్షన్లను లబ్ధిదారులకు అందజేస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్ తదితరులు

మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: సామాజిక పెన్షన్ల పెంపు దేశ చరిత్రలో ఒక్క ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోనే అమలవుతోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. రూ.3 వేలు పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం కూడా ఏపీనేనని ఆయన గుర్తు చేశారు. అమలాపురం పట్టణంలోని పెన్షనర్లకు కొత్తగా పెరిగిన రూ.3 వేలను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన సభలో మంత్రి విశ్వరూప్ లబ్ధిదారులకు అందించి ప్రసంగించారు. పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి విశ్వరూప్‌తోపాటు ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కౌన్సిలర్లు లబ్ధిదారులకు పెరిగిన పెన్షన్లను పంపిణీ చేశారు. పెన్షన్ల పెంపునకు శ్రీకారం చుట్టింది దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని మంత్రి విశ్వరూప్ గుర్తు చేశారు. తర్వాత ఆయన తనయుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ.2,000 నుంచి అంచెలంచెలుగా రూ.3 వేలకు పెంచిన ఘనత దక్కించుకున్నారని చెప్పారు. సంక్షేమ సారిధి అయిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆది నుంచీ పెన్షనర్ల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు రాష్ట్ర ప్రజలు మానసికంగా సిద్ధమై ఉన్నారని చెప్పారు. మున్సిపాలిటీలో ఉన్న దాదాపు 4,500 పెన్షనర్లకు రూ.1.50 కోట్ల మేర పెన్షన్లను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, కట్టోజు సన్యాసయ్యదాసు, నాగారపు వెంకటేశ్వరరావు, చిట్టూరి పెదబాబు, బండారు గోవిందు ప్రసంగించారు.

కోడి పందేలు చట్టరీత్యా నేరం

నిర్వహిస్తే బాధ్యులపై చర్యలు



అమలాపురం టౌన్: సంక్రాంతి పండగను సంప్రదాయ బద్ధంగా, ప్రశాంత వాతావరణంలో ప్రజలు జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కార్యాలయం సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది. ముఖ్యంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. సంక్రాంతి సందర్భంగా ఎవరైనా ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే చట్టరీత్యా నేరమని స్పష్టం చేసింది. పందేలను నిర్వహిస్తే చర్యలు తప్పవని పేర్కొంది. సంక్రాంతి పండగల నేపథ్యంలో జిల్లా ప్రజలకు పలు సూచనలు, జాగ్రత్తలను సూచిస్తూ ఎస్పీ కార్యాలయం ఈ ప్రకటన విడుదల చేసింది.

- జిల్లాలోని రైతులకు చెందిన లేదా ఎలాంటి జిరాయితీ భూముల్లో కోడి పందేలు, పేకాటలు, అశ్లీల నృత్యాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు ఆ భూ యాజమానులు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వవొద్దు.
- అలాంటి భూముల్లో పందేలకు అనుమతులు ఇస్తే యాజమానులపై చర్యలు
- కోడి కత్తులు కట్టే వారిపైనా, పందేలు నిర్వహించే వారిపైనా, గుండాటల నిర్వాహకులపైనా కఠిన చర్యలు తీసుకుంటాం. వారిని గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేస్తాం.
- కోడి కత్తుల తయారీదారులను గుర్తించి వారి నుంచి కత్తులను స్వాధీనం చేసుకుంటాం.
- మీ మీ ప్రాంతాల్లో లేదా పొలాలు, రహస్య ప్రదేశాల్లో కోడి పందేలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే సమాచారాన్ని 100 లేదా 112కు, 6305026565 ఫోన్ నంబర్‌కు తెలియజేయవచ్చు.
- పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులతో మండల స్థాయి సంయుక్త తనిఖీ బృందాలను ఏర్పాటు చేశాం.
- గ్రామాల్లో కోడి పందేలు, జూదం, ఇతర అసాంఘీక కార్యకలాపాల నిరోధానికి ఎస్సై, సీఐ, డీఎస్పీలతో ప్రత్యేక నిఘా
- అనుమానిత గ్రామాలు, ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక బృందాలను నియమించడంతోపాటు నిరంతర పెట్రోలింగ్

పదికం ప్రకారం కసరత్తు

- టెన్త్‌లో మెరుగైన ఫలితాలకు జిల్లా పరిషత్ చర్యలు
- 'జగనన్న విద్యాభారతి' స్టడీ మెటీరియల్ రూపకల్పన
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 50,413 మందికి పంపిణీ



పదో తరగతి విద్యార్థులు



జగనన్న విద్యాభారతి స్టడీ మెటీరియల్

రాయవరం: జిల్లాలో పదవ తరగతి ఫలితాల్లో మెరుగైన స్థానం సంపాదించేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో ఉంచేందుకు ఇప్పటికే విద్యాశాఖ అధికారులతో పాటు, ఉపాధ్యాయులు కూడా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు..ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జిల్లా పరిషత్ యాజమాన్యం కూడా తన వంతు కృషి చేస్తోంది. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా 'జగనన్న విద్యాభారతి' స్టడీ మెటీరియల్ పంపిణీకి జిల్లా పరిషత్ అధికారులు చర్యలు చేపట్టారు.

ప్రణాళికాయుతంగా..

విద్యార్థులకు ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జూలై నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఏటా నవంబర్ నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా, ఈ ఏడాది జూలై నుంచే ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండడం గమనార్హం. గతేడాది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పది ఫలితాల్లో 13వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది మరింత మెరుగైన స్థానం కోసం విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రణాళిక ప్రకారం కృషి చేస్తున్నారు.

'జగనన్న విద్యాభారతి' పేరుతో

పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతే లక్ష్యంగా ఏటా 'జగనన్న విద్యాభారతి' పేరుతో జిల్లా పరిషత్ యాజమాన్యం స్టడీ మెటీరియల్‌ను అందజేస్తోంది. ఈ ఏడాది కూడా స్టడీ మెటీరియల్‌ను రూపొందించి, ముద్రించి ఆయా జిల్లా కేంద్రాలకు పంపించారు. విద్యాభారతి పుస్తకాన్ని నిపుణులైన సబ్జెక్టు ఉపాధ్యాయుల సూచనలతో రూపొందించారు. ఏటా రూపొందించే పుస్తకం నుంచి 70 శాతం ప్రశ్నలు పరీక్షా పత్రాల్లో వస్తున్నాయి. విద్యార్థులు ఎక్కువ స్కోరింగ్ చేయడానికి ఉపయోగపడేలా నిపుణులైన ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించారు.

బీ,సీ కేటగిరీ విద్యార్థులపై

'బి' కేటగిరీ విద్యార్థులు కొన్ని సబ్జెక్టుల్లో బాగా చదువుతూ మరికొన్ని సబ్జెక్టుల్లో వెనుకబడుతుంటారు. 'సి' కేటగిరీ విద్యార్థులు ఒకటి రెండు సబ్జెక్టులు తప్ప ఇతర సబ్జెక్టులన్నింటిలో వెనుకబడుతుంటారు. అలాంటి విద్యార్థులే లక్ష్యంగా స్టడీ మెటీరియల్‌ను రూపొందిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులు సైతం ఈ స్టడీ మెటీరియల్‌ను అనుసరిస్తే ఉత్తీర్ణులయ్యే అవకాశం మెండుగా ఉండేలా రూపొందించారు.

ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని 50,413 మంది విద్యార్థులకు 'జగనన్న విద్యాభారతి' స్టడీ మెటీరియల్‌ను జిల్లా పరిషత్ యాజమాన్యం పంపిణీ చేసింది. 27,682 మంది ఇంగ్లిష్ మీడియం, 22,731 మంది తెలుగు మీడియం విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఆయా జిల్లా కేంద్రాలకు పంపిణీ చేయగా జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాలకు పంపిణీ చేశారు. కోనసీమ జిల్లాలో స్టడీ మెటీరియల్‌ను ఇంగ్లిష్ మీడియంలో 8,662, తెలుగు మీడియంలో 5,354 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లోని విద్యార్థులందరికీ స్టడీ మెటీరియల్‌ను ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గతేడాది 48,727 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేయగా, ఈ ఏడాది 1,686 మందికి అధికంగా పంపిణీ చేశారు.

క్లుప్తంగా

12 నుంచి జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు

రామచంద్రపురం: రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 13వ ఆలిండియా, 19వ ఏపీ బాస్కెట్‌బాల్ పురుషుల మహిళల పోటీలను ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెలికాని స్టాలిన్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఏటా సంక్రాంతిని పురస్కరించుకుని జరుగుతున్న ఈ పోటీలలో ఓపెన్ కేటగిరిలో జాతీయ స్థాయి పురుషుల మహిళల జట్లు పాల్గొంటాయన్నారు. క్రీడాభిమానులు, ఈ పోటీలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ చౌర్యంపై కేసు

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి జరిమానా విధించినట్లు రాజమహేంద్రవరం ఏపీటీఎస్ ఇన్‌స్పెక్టర్ కె.నాగమోహనరెడ్డి తెలిపారు. అధికారుల సూచనలపై సోమవారం కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి గ్రామంలో దాడి నిర్వహించగా విద్యుత్ చౌర్యం కేసు నమోదు చేసి ముద్దాయికి రూ.84,597 అపరాధ రుసుము, రూ.3వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

హత్యాయత్నం చేసిన ఇద్దరి అరెస్టు

ఆత్రేయపురం: మండల పరిధిలోని లొల్ల గ్రామంలో అక్రమ కట్టడం విషయంలో పంచాయతీ, పోలీసు సిబ్బందిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు. లొల్ల గ్రామానికి చెందిన పెన్నింటి సాయికృష్ణ, కల్లూరి మణికంఠ లొల్ల గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడం కడుతున్నట్లు పోలీసు స్టేషన్‌కు గ్రామ పంచాయతీ నుంచి ఫిర్యాదు అందిందన్నారు. దీంతో గ్రామ పంచాయతీ సిబ్బంది, బందోబస్తు నిమిత్తం వెళ్లిన పోలీసు సిబ్బంది విధులను అడ్డుకుని దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మామిడిని ముంచే 'మంచు'

- పూత నిలిస్తే రైతుకు కనక వర్షమే
- తెగుళ్లపై జాగ్రత్తలు అవసరం

రాయవరం: ఇప్పుడిప్పుడే మామిడి పూత దశకు చేరుకుంటోంది. పూత పిందెగా మారితేనే మామిడి రైతుకు లాభిస్తుంది. ప్రస్తుతం కురుస్తున్న మంచు, చలితో తెగుళ్లు విజృంభించే అవకాశం ఉంది. ముఖ్యంగా మంచుకు పూత మాడిపోయే అవకాశం ఉంటుంది. తేనె మంచు పురుగు, ఆకు జల్లెడ గూడు పురుగు, పచ్చ పురుగు, పక్షికన్ను మచ్చ, బూడిద తెగుళ్లు వంటివి ఆశించే అవకాశం ఉంటుందంటున్నారు జిల్లా ఉద్యాన శాఖ అధికారి బీవీ రమణ. మామిడిలో రకాలు, యాజమాన్య పద్ధతులపై ఆయన చెబుతున్న వివరాలివీ..



బీవీ రమణ, ఉద్యానవన శాఖ అధికారి, కోనసీమ జిల్లా

జిల్లాలో పరిస్థితి ఇదీ..

ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో 30వేల ఎకరాల్లో మామిడిని పండిస్తున్నారు.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సుమారు 308.77 ఎకరాల్లో మామిడి పండుతోంది. జిల్లాలో మలికిపురం, మామిడికుదురు, సఖినేటిపల్లి, రాజోలు, రామచంద్రపురం, మండపేట, ఆత్రేయపురం, ఉప్పలగుప్తం మండలాల్లో రైతులు మామిడి అధికంగా పండిస్తున్నారు. ప్రధానంగా బంగినపల్లి, కలెక్టరు, పెద్దరసం, చెరకురసం, కొత్తపల్లి కొబ్బరి, రాయల్ స్పెషల్, సువర్ణరేఖ వంటి రకాలు పండుతున్నాయి.

యాజమాన్య పద్ధతులు



విరగబూసిన మామిడి పూత

మామిడి పూతకు ముందు, పూత దశలో అనేక రకాల పురుగులు, తెగుళ్లు ఆశించి పంటకు నష్టం కలిగిస్తాయి. సరైన నీటి యాజమాన్యం, పోషకాల యాజమాన్యం చేపట్టకపోతే పిందెలు ఎక్కువగా రాలిపోవడంతో పాటు కాయసైజు, నాణ్యత తగ్గిపోయే అవకాశం ఉంది.

తేనెమంచు పురుగు

మేంగో హోపర్‌గా పిలిచే తేనెమంచు తల్లి పురుగులు, పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులు, పూతకాడలు, పూలు, లేతపిందెల రసాన్ని విపరీతంగా పీల్చేస్తాయి. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు పూత ఎక్కువగా ఉన్న దశలోనే తేనె మంచు పురుగు ఆశిస్తుంది. పొడి వాతావరణం, మంచు ఎక్కువగా ఉన్న సమయంలో ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. పూత లేని సమయంలో చెట్టు బెరడు, మూలల్లో తల్లిపురుగు దాక్కుని ఉంటుంది. తేనెమంచు పురుగు ఆశించిన కారణంగా ఆకుల చివర్లు, అంచులు, పూత నల్లగా మాడిపోయి పూత గుత్తులుగా మాడిపోతుంది. పిందెలుగా ఉన్నప్పుడే రాలిపోతాయి. ఈ పురుగులు విసర్జించిన తేనెలాంటి తియ్యని పదార్థం కారణంగా మచ్చ తెగులు, పూత కాడలపై, కాయలపై, ఆకులపై నల్లని మసిగా ఏర్పడుతుంది. దీనివల్ల ఆకుల్లో కిరణజన్య సంయోగక్రియ జరగక కాయలు చిన్నవై రాలిపోతాయి. పెరిగిన కాయలపై నల్లని బూడిద ఉండడంతో మార్కెటింగ్‌కు పనికిరావు.



నివారణ చర్యలు

తోటలో నాలుగు నుంచి ఐదు అడుగుల ఎత్తులో ఆయిల్ పూసిన పసుపురంగు బోర్డులను ఏర్పాటు చేయాలి. ఎకరానికి నాలుగు నుంచి ఐదు ఏర్పాటు చేయాలి. పువ్వు, మొగ్గ దశలో లీటరు నీటికి డైక్లోరోవాస్(డీడీవీపీ) 0.5మిల్లీలీటర్లు మందును లేదా మూడు గ్రాములు కార్బరిల్ లీటరు నీటికి కలిపి చెట్టు బెరడు, మూలలు తడిసేవిధంగా పిచికారీ చేయాలి. దీనివలన మొగ్గ తొలిచే గొంగళి పురుగును కూడా నివారించవచ్చు. పచ్చి పూత దశలో 1.5 మిల్లీలీటర్ల నుంచి రెండు మిల్లీలీటర్ల మోనోక్రోటోఫాస్ లేదా రెండు మిల్లీలీటర్ల డైమిథోయేట్, లేదా రెండు మిల్లీలీటర్ల మిథైల్ డెమటాన్ లేదా 0.25మిల్లీలీటర్ల ఇమిడాక్లోప్రిడ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఒక చెట్టుకు 10నుంచి 15లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి. పిందెదశ(నల్లపూత)లో లీటరు నీటికి ఒక మిల్లీలీటరు పాస్ఫోమిడాన్ లేదా రెండు మిల్లీలీటర్ల మిథైల్‌డెమటాన్, రెండు మిల్లీలీటర్ల డైమిథియేట్ లేదా ఒక గ్రాము అసిఫేట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తామర పురుగులు

రెండు మిల్లీమీటర్ల పొడవు, జాలరు వంటి రెక్కలు కలిగి ఉండే తామర పురుగులు పూత, కాయదశల్లో ఆశిస్తాయి. చిగురు ఆకులు, కాయల తొడిమల వద్ద, పూతను గోకి రసాన్ని పీలుస్తాయి. దీనివల్ల పూత రాలిపోవడం, కాయలపై రాతి మంగు ఏర్పడుతుంది. దీని నివారణకు పాస్ఫోమిడాన్ ఒక మిల్లీలీటరు, ఫిప్రోనిల్ రెండు మి.లీ, ఎసిఫేట్ ఒక గ్రాము మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పైన సూచించిన మందులతో పాటు మూడు మి.లీ. వేప నూనె లేదా ఐదు శాతం వేప కషాయం కలిపి పిచికారీ చేస్తే ఫలితాలు బాగుంటాయి.

టెంక పురుగు

కాయలు గోళీ సైజులో ఉన్నప్పుడు కాయపై భాగాన్ని గోకి గుడ్లు పెడుతుంది. పిల్లపురుగులు కాయను తొలుచుకుని పోయి లేత టెంక పప్పును తింటాయి. కాయ ఎదిగే దశలో రంధ్రం మూసుకుపోతుంది. పిల్లపురుగు తల్లిపురుగుగా మారినప్పుడు అది విసర్జించే పదార్థాలను కండలోకి తీసుకుని రావడం వల్ల కాయ కుళ్లి నాణ్యత కోల్పోతుంది. కాయలు లేని సమయంలో టెంక పురుగులు చెట్టుబెరడు, ఎండతగలని చోట దాక్కుని ఉండి కేవలం మామిడిపంటను మాత్రమే ఆశిస్తాయి. దీని నివారణకు లీటరు నీటికి ఒక మి.లీ పెంథియాన్, మూడు గ్రాముల కార్బరిల్, రెండు మి.లీ మోనోక్రోటోపాస్ 15 రోజులకొకసారి రెండుసార్లు పిచికారీ చేయాలి.

పూతచుట్టు పురుగు

ఈ పురుగులు పూత గుత్తుల్ని గూడుగా ఏర్పరుచుకుని తింటుంటాయి. పూతకాడల్ని తొలుచుకుని తినడంతో పూత వడలిపోయి రాలి పోతుంది. డైక్లోరోవాస్(డీడీవీపీ) 0.5మిల్లీలీటర్లు మందును లేదా మూడు గ్రాముల కార్బరిల్ లీటరు నీటికి కలిపి చెట్టు బెరడు, మూలలు తడిసే విధంగా పిచికారీ చేయాలి.

బూడిద తెగులు

పొడి, చల్లని, మబ్బు వాతావరణంలో బూడిద తెగులు సోకడానికి అవకాశం ఉంది. లేత ఆకులు, పువ్వు, పువ్వుకాడలు, పిందెలపై తెల్లటి బూజు ఏర్పడుతుంది. బూజు ఏర్పడిన ప్రదేశంలో పోషకాలను పీల్చివేయడంతో పూలు, పిందెలు వడలి రాలిపోతాయి. నివారణకు ఎక్సాకోనజాల్ రెండు మి.లీ, ప్రొపికొనజోల్ ఒక మి.లీ మందును లీటరు నీటికి కలిపి పూతంతా తడిసేలా పిచికారీ చేయాలి. పూత కన్పిస్తున్న దశలోనే పిచికారీ చేయాలి. డైనోకాప్ లేదా ట్రిడామార్ఫ్ ఒక మి.లీ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఆకుమచ్చ, పూతమాడు తెగులు

వర్షాలు, పొగమంచు అధికంగా ఉంటే ఆకుమచ్చ, పూతమాడు తెగుళ్లు ఆశిస్తాయి. ఈ తెగులు వేళ్లు మినహా చెట్టంతా ఆశిస్తుంది. ఆకులపై గోధుమరంగు మచ్చలు ఏర్పడి క్రమంగా కలిసి పోయి ఆకులు త్వరగా పండి రాలిపోతాయి. లేతరెమ్మలు, పూగుత్తులపై మచ్చలు ఏర్పడి పూలు మాడిపోయి రాలిపోతాయి. పూత నుంచి మొగ్గ బయటకు వచ్చే సమయంలో మూడు గ్రాముల కోపరాక్సీక్లోరైడ్ లేదా పచ్చిపూతపై ఒక గ్రాము కార్బండిజమ్ లేదా ఒక గ్రాము థయోఫేనేట్‌మిథైల్, పిందె దశలో 2.5గ్రాముల మేంకోజబ్ అనే మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

నేటి నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

ప్రైవేటు తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

రాయవరం: ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య, ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించింది. మంగళవారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటిస్తూ ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. కోనసీమ జిల్లా పరిధిలో ఉన్న 2,035 ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో చదువుతున్న 2.08 లక్షల మంది విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ఇచ్చారు. సంక్రాంతి సెలవులకు ముందు సోమవారం చివరి పనిదినం కావడంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, సంక్రాంతి పండగను నిర్వహించారు. ఆరు రోజులు ముందుగానే పాఠశాలల్లో పండగ వాతావరణం కన్పించింది. భోగిమంటలు వేయడం, హరిదాసులు, గంగిరెద్దులు, సంక్రాంతి ముగ్గులు ఇలా పాఠశాలల్లో పండగ వాతావరణం ఏర్పడింది.



రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హరిదాసుల వేషధారణలో విద్యార్థులు



ద్రాక్షారామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సందడి

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

సంక్రాంతి సెలవుల్లో పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈఓ ఎం.కమలకుమారి హెచ్చరించారు. ఈ నెల తొమ్మిదవ తేదీ నుంచి 18వ తేదీ వరకు ప్రభుత్వం అన్ని యాజమాన్యాల పరిధిలో గల పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించిందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఎక్కడా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించరాదని తెలిపారు.

రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం

- ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య
- రాజమహేంద్రవరంలో అట్టహాసంగా రైతు సంఘం రాష్ట్ర మహాసభలు

ప్రకాశం నగర్: (రాజమహేంద్రవరం) : కేంద్రం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 18వ మహాసభలు సోమవారం రాజమహేంద్రవరంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అంతకు ముందు స్థానిక మున్సిపల్ స్టేడియం నుంచి ఇస్కాన్ టెంపుల్ రివర్ బే ఆహ్వానం ఫంక్షన్ హాల్ వరకు రైతులు మహా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రైతు సంఘం మహాసభలు కొల్లి నాగేశ్వరరావు ప్రాంగణం, వైవీ కృష్ణారావు, చంద్రప్పన్ వేదిక వద్ద ప్రారంభమయ్యాయి. ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రైతుల్లో ఐక్యత లేదని హేళన చేసిన వారికి బుద్ధి చెప్పే తరహాలో రైతు ఉద్యమం జరిగిందన్నారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 450 రైతు సంఘాలు ఒకే వేదిక పైకి వచ్చి చేసిన పోరాటం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. 13 నెలలుగా నిర్విరామంగా నిద్రాహారాలు మాని రైతులు చేసిన పోరాటానికి మోదీ ప్రభుత్వం తలవంచక తప్పలేదని అన్నారు.

సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్, వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాదీశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెస్ స్వామినాథన్ శాస్త్రీయంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి సిఫారసులు చేస్తే దానిని నేటికీ అమలు చేయలేదన్నారు. పేదల కష్టాన్ని అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నాడని మండిపడ్డారు. మోదీ 9 సంవత్సరాలలో రూ.14.65 లక్షల కోట్లు కార్పొరేట్ సంస్థల రుణాలు రద్దు చేశారని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు జనవరి 26న రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపడుతామన్నారు. జనవరి 12వ తేదీ విజయవాడలో రైతు సమస్యలపై సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర నాయక్ బృందం ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. సీపీఐ రాష్ట్ర కార్య వర్గ సభ్యురాలు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జట్లు సంఘం అధ్యక్షుడు కొండ్రపు రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు పాల్గొన్నారు.



మహా ప్రదర్శనలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు

ఇంజనీర్‌పై దాడి చేసిన వారిని శిక్షించండి

కాకినాడ సిటీ: పెద్దాపురం డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వరరావుపై రాజుపాలెంలో కొంతమంది వ్యక్తులు దాడికి పాల్పడడంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్, ఏపీ ఇంజినీరింగ్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధులు సోమవారం జేసీ ఇలక్కియను కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై కిర్లంపూడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. ఈఈ వెంకటేశ్వరరావు ఎన్‌డీబీ పథకంలో రాజుపాలెం–రామవరం రోడ్డులో జరుగుతున్న పని పర్యవేక్షణ నిమిత్తం ఈ నెల 6వ తేదీ రాజుపాలెం నుంచి రామవరం వెళ్లి తిరుగు ప్రయాణంలో మళ్లీ రాజుపాలెం చేరుకున్నారు. అప్పుడు 10 మంది మద్యం సేవించి ఈఈ వెంకటేశ్వరరావుపై దాడికి పాల్పడ్డారన్నారు. తనపై దాడికి రాజుపాలెంకు చెందిన గణేశుల రాంబాబు అనే క్లాస్–1 కాంట్రాక్టర్ చేయించి ఉంటాడని జేసీకి వివరించారు. తనపై జరిగిన దాడిని ఓ వ్యక్తి చిత్రీకరించి బయట వ్యక్తులకు పంపాడని, పోలీసులు వచ్చే సమయానికి ఆ వ్యక్తి స్కూటర్‌పై పరారీ అయ్యాడని జేసీ ఇలక్కియకు వివరించారు. నాయకులు పసుపులేటి శ్రీనివాసరావు, గుద్దటి రామమోహన్‌రావు, పేపకాయల వెంకటకృష్ణ, ఇంజినీరింగ్ అసోసియేషన్ నాయకులు కేఎస్ రాఘవరావు, బీవీ మధుసూదనరావు పాల్గొన్నారు.



జేసీ ఇలక్కియకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీ ఎన్‌జీవో, ఏపీ ఆర్‌అండ్‌బీ అసోసియేషన్ల ప్రతినిధులు

నేర అన్వేషణలో ఫోరెన్సిక్ శాఖ కీలకం

గండేపల్లి: నేర అన్వేషణలో ఫోరెన్సిక్ శాఖ పోలీస్ శాఖకు కీలకమైనదని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థలలో 'ఫోరెన్సిక్‌లో వివిధ నూతన అన్వేషణ పద్ధతులు, వాటి అధ్యయనం' అనే అంశంపై రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ స్థాయి సదస్సుకు సోమవారం మొదటి రోజు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేర విభాగాలలో ఫోరెన్సిక్ దోహదపడుతుందన్నారు. ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేర అన్వేషణ ఏ విధంగా చేయాలి అనే అంశాలపై వివరించారు. మరో ముఖ్య అతిథి రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ ఎం.నాగిరెడ్డి ప్రసంగించారు. ఆదిత్య విద్యాసంస్థల అధినేత ఎన్.శేషారెడ్డి, వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ విలాస్ అనిల్ చవాన్ పాల్గొన్నారు.



కార్యక్రమాన్నుద్దేశించి మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

రాజపూడిలో రేషన్ బియ్యం పట్టివేత

జగ్గంపేట: మండలంలోని రాజపూడి గ్రామంలో రెండు ఇళ్లలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. జగ్గంపేట ఎంఎస్‌ఓ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం రాజపూడి గ్రామంలో ఎ. శ్రీనివాసు ఇంట్లో 1,083 కిలోల బియ్యాన్ని, అప్పన వీరబాబు ఇంట్లో 920 కిలోల బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటిని కేసు విచారణ పూర్తి అయ్యేవరకు సివిల్ సప్లయిస్ గొడౌన్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. వీరిపై పోలీసులకు సమాచారం అందించి కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ దాడులలో విజిలెన్స్ అధికారులు, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు..



వీరబాబు ఇంట్లో రేషన్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

148 లీటర్ల మద్యం స్వాధీనం

అయినవిల్లి: యానాం నుంచి అయినవిల్లి మండలం తొత్తరమూడి పెదపాలెం మీదుగా ఓ కారులో అక్రమంగా మద్యం తరలిస్తుండగా సోమవారం తెల్లవారుజామున అయినవిల్లి ఎస్సై సురేష్‌బాబు స్వాధీనం చేసుకున్నారు. పి.గన్నవరం సీఐ ప్రశాంత్‌కుమార్ విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం తెల్లవారుజామున అయినవిల్లి మండలం తొత్తరమూడి పెదపాలెం కనకదుర్గమ్మ ఆలయం వద్ద తనిఖీలు చేస్తుండగా యానాం నుంచి ఓ కారులో కె.గంగవరానికి చెందిన వాసంశెట్టి శ్రీనివాసరావు అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. కారులో ఉన్న 148 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.1,35,400 ఉంటుందన్నారు. వాసంశెట్టి శ్రీనివాస్‌ను అరెస్టు చేసి కోర్టుకు అప్పగించామన్నారు. నిందితుడు యానాంలోని ఓ మద్యం షాపులో పనిచేస్తున్నాడు. అతను గుంటూరుకు చెందిన ఓ వ్యక్తితో మద్యం సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడని విచారణలో తేలిందన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

మత్స్యకారులకు అవగాహన

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడలో మెరైన్ ఏఎస్సై మధుబాబు మత్స్యకారులకు సోమవారం అవగాహన కల్పించారు. మెరైన్, కోస్టుగార్డు, మత్స్యశాఖ అధికారులతో కలిసి మత్స్యకారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. మెరైన్ ఏఎస్సై మధుబాబు మాట్లాడుతూ సముద్రంలోకి వెళ్లేటప్పుడు మద్యం సేవించరాదని, బోటులో పరిమితికి మించి వెళ్లరాదని, బోటులకు లైసెన్సు తప్పని సరిగా రెన్యూవల్ చేయించుకోవాలని, సముద్రంలో అనుమానిత వ్యక్తులు, ఇతర దేశాలకు సంబంధించిన బోట్లు కనిపించిన వెంటనే మెరైన్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. డేట్ యంత్రంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ యంత్రంలో నాలుగు ఇండికేటర్స్ ఉంటాయని, అగ్ని ప్రమాదం జరిగినపుడు, అనారోగ్యానికి గురైనపుడు, బోటు ప్రమాదానికి గురైనా, అత్యవసర సహాయం కోసం వాటిని ఉపయోగించుకోవచ్చన్నారు. ఇండికేటర్ స్విచ్ నొక్కిన వెంటనే కోస్ట్ గార్డుకు సమాచారం వెళుతుందని దీని ద్వారా సహాయాన్ని పొందవచ్చని తెలియపరిచారు.



మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న మెరైన్ ఏఎస్సై మధుబాబు

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరి మృతి

కపిలేశ్వరపురం: మండలంలోని కాలేరు–నల్లూరు రహదారిలో ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు బైక్‌లు ఢీకొని వాటిని నడుపుతున్న ఇద్దరు యువకులు మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం సోమవారం రాత్రి కె.గంగవరం మండలం యండగండికి చెందిన కడలి త్రిమూరులు (32), కపిలేశ్వరపురం మండలం వడ్లమూరుకు చెందిన పెందుర్తి సతీష్ (19) వేర్వేరు బైక్‌లపై ఎదురెదురుగా ప్రయాణిస్తూ కాలువ రహదారిలో ఢీకొన్నారు. వివాహితుడైన యండగండికి చెందిన త్రిమూర్తులు తలకు గాయమై అక్కడికక్కడే చనిపోయాడు. వడ్లమూరుకు చెందిన సతీష్‌ను 108లో మండపేట ఆసుపత్రికి తరలించగా మృతిచెందారు. ఈ విషయమై విచారణ చేపట్టినట్టు అంగర ఎస్సై జి.చంటి తెలిపారు.



కాలేరు–నల్లూరు రహదారిలో మృతి చెందిన త్రిమూర్తులు